సాక్షి సిద్దిపేట
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



### అతివల ఆనందం
రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి ఫ్రీ బస్ స్కీంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
వివరాలు 8లో ▸



### అనుమానాస్పద స్థితిలో..
అనుమానాస్పద స్థితిలో భార్య మృతి చెందగా భర్తే ఆమెను హత్య చేశాడని ఆరోపిస్తూ బాధితురాలి బంధువులు ఆందోళనకు దిగారు.
వివరాలు 8లో ▸



### మళ్లీ చిరుత కలకలం
పెద్దశంకరంపేట మండలంతో పాటు రేగోడ్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలాల్లో రెండు నెలలుగా చిరుత పులి సంచరిస్తోంది.
వివరాలు 8లో ▸

## న్యూస్‌రీల్

### సీపీఎస్‌ను రద్దు చేయాలి
**మంత్రి శ్రీధర్‌బాబును కోరిన టీపీఎస్‌ఈఏ నేతలు**



శ్రీధర్‌బాబుకు సమస్యలను వివరిస్తున్న టీపీఎస్‌ఈఏ నేతలు

**గజ్వేల్:** రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖా మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబును శనివారం టీపీఎస్‌ఈఏ(తెలంగాణ స్టేట్ కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్) నేతలు కలిశారు. హైదరాబాద్ ఆదర్శ నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణకుమార్, హన్మాండ్ల భాస్కర్ సీపీఎస్ రద్దుకు చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన శ్రీధర్‌బాబు సీపీఎస్ రద్దుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సీఎంతో చర్చించి తగు చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, కార్యదర్శి చేరాల తిరుపతి, నాయకులు ఆకుల చంద్రశేఖర్, తాళ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ కోలుకోవాలని పూజలు



పూజలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి, నాయకులు

**గజ్వేల్:** మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని మాజీ అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ ఎఫ్‌డీసీ)చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం గజ్వేల్‌లోని మహంకాళీ ఆలయంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులతో కేసీఆర్ త్వరగా కోలుకొని ప్రజలకు సేవలందిస్తారని అన్నారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లేశం, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం క్రిష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు బెండ మధు, పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, బయ్యారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే, గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు మొగుళ్ల కనకయ్య చనిపోవడంతో ఆయన భార్య లావణ్యకు బీఆర్‌ఎస్ తరఫున రూ.2 లక్షల ప్రమాదబీమా చెక్కును ఆ గ్రామ సర్పంచ్ బాల్‌చంద్రంతో కలిసి ప్రతాప్‌రెడ్డి అందజేశారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు మైథిలి
**నారాయణఖేడ్:** జిల్లాలోని బీరంగూడలో శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నీలో ఖేడ్‌కు చెందిన మైథిలి ప్రతిభ కనబరిచారు. దీంతో ఆమె రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఖేడ్ బ్యాడ్మింటన్ కోచ్ అబ్దుల్ సాజిద్ తెలిపారు.







**ఎమ్మెల్యేగా నేను..**
అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్, అందోల్ ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహ

# ఆరోగ్యం.. పదిలం

**రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు పెరిగిన ఆరోగ్యశ్రీ పథకం**

- జిల్లాలోని 5 ప్రభుత్వ, 9 ప్రైవేటు ఆస్పత్రుల్లో అమలు
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- వైద్య సేవల పోస్టర్, బస్సు టికెట్ ఆవిష్కరణ



రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జే.పాటిల్, సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, డీఎంహెచ్‌ఓ కాశీనాథ్, తదితరులు

**సిద్దిపేటకమాన్:** నిరుపేదలు ఒక్కరూపాయి ఖర్చు లేకుండా రూ.10 లక్షల వరకు ఖరీదైన, కార్పొరేట్ తరహా వైద్య సేవలను రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పొందవచ్చని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లోని రెండు మహాలక్ష్మీ పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కలెక్టర్ శనివారం ప్రారంభించారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయం రూ.10 లక్షలకు సంబంధించిన పోస్టర్‌ను, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం సంబంధించి బస్సును ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. పల్లె వెలుగు బస్సులో మహిళలు, ఆస్పత్రికి వైద్య సేవల కోసం వచ్చిన మహిళలు, ఆశా కార్యకర్తలు, మహిళా కానిస్టేబుళ్లతో కలిసి కలెక్టర్ ఆస్పత్రి నుంచి మోడ్రన్ బస్టాండ్ వరకు ప్రయాణించారు. బస్సులో మహిళలకు జీరో చార్జీలతో కూడిన మహాలక్ష్మి ఉచిత ప్రయాణ టికెట్‌ను కండక్టర్ అందించారు.

**కలెక్టరేట్ నుంచి సమీక్ష**

అంతకుముందు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 5 ప్రభుత్వ, 9 ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయన్నారు. ఈ పథకం జిల్లాలో అమలును ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ సమన్వయంతో కలెక్టరేట్ నుంచి ప్రత్యేకంగా సమీక్షిస్తామన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పథకం అమల్లో ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేసేందుకు నేటి నుంచి కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సుల్లో 30 నుంచి 40 వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని తెలిపారు. బస్సుల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ సదానందం, డాక్టర్ బాబు, రాజేందర్, ఆర్టీసీ డీఎం సుఖేందర్‌రెడ్డి, సిబ్బంది మౌలానా, వైద్యారోగ్యశాఖ సిబ్బంది డాక్టర్ శ్రీకాంత్, ఏఎన్‌ఎంలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జే.పాటిల్



సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌లో జీరో చార్జీలతో ఇచ్చిన ఉచిత టికెట్‌ను చూపుతున్న మహిళలు

### సంతోషంగా ఉంది



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషంగా ఉంది. ఆస్పత్రి పని నిమిత్తం సిద్దిపేటకు వచ్చాం. తిరిగి సిద్దిపేట నుంచి బచ్చన్నపేటకు వెళ్తున్నాం. ఇంతకు ముందు బస్సు చార్జీ రూ.60 ఉండేది. కానీ ఇప్పుడు చార్జీలు తీసుకోకుండా ఉచితంగా మహిళలకు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు.

\- పుష్పలత, ప్రయాణికురాలు

### గతంలో రూ.40 ఖర్చయ్యేది



పని నిమిత్తం సిద్దిపేట పట్టణానికి వచ్చి తిరిగి దుద్దెడకు వెళ్తున్నాం. ఇంటి నుంచి సిద్దిపేటకు రావడానికి, తిరిగి ఇంటికి వెళ్లడానికి రూ.40 ఖర్చు అయ్యేవి. ప్రస్తుతం టికెట్‌కు డబ్బులు తీసుకోకపోవడంతో ఆ డబ్బులు ఆదా అవుతాయి. మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పించడం బాగుంది.

\- మల్లవ్వ, ప్రయాణికురాలు

# అప్పుడు.. ఇప్పుడు!

- ఉమ్మడి మెదక్ జిల్లాకు మరోసారి దక్కిన వైద్యారోగ్య శాఖ
- గత ప్రభుత్వ హయాంలో మంత్రి హరీశ్‌రావు
- ప్రస్తుతం దామోదర రాజనర్సింహకు చాన్స్



**సాక్షిప్రతినిధి, సంగారెడ్డి:** అందోల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న దామోదర రాజనర్సింహకు వైద్యారోగ్యశాఖ మంత్రి పదవి దక్కింది. గత ప్రభుత్వ హయాంలో కూడా ఈ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లాకే దక్కింది. కేసీఆర్ కేబినెట్‌లో సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు వైద్యశాఖ మంత్రిగా పనిచేసిన విషయం విధితమే. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఈ శాఖ అందోల్ ఎమ్మెల్యే దామోదరను వరించడం గమనార్హం. ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన మంత్రులకు శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం జీఓ నంబర్ 179 జారీ చేసింది. దామోదర రాజనర్సింహకు వైద్యారోగ్యశాఖతో పాటు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కూడా కేటాయించారు. మూడున్నర దశాబ్దాల పాటు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న దామోదరకు గతంలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేబినెట్‌లో కూడా మంత్రిగా పనిచేశారు. అప్పట్లో ఆయన ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా సేవలందించారు. ఆ తర్వాత సీఎంగా పనిచేసిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గాల్లో కూడా పనిచేశారు. మార్కెటింగ్, గిడ్డంగులు, ఉన్నత విద్యాశాఖ మంత్రిగా దామోదర సేవలందించారు. ఈసారి దామోదరకు హోంశాఖ గానీ, రెవెన్యూ శాఖ గానీ దక్కుతుందని అందరూ భావించినప్పటికీ.. కీలకమైన వైద్యారోగ్యశాఖను కేటాయించారు.

**ప్రాధాన్యత కలిగిన శాఖ**

ప్రతి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుంది. నిరుపేదల జీవన ప్రమాణాలను పెంచడంలో ఈ రెండు శాఖలు ఎంతో కీలకమైనవి. ఇలాంటి శాఖలను సమర్థవంతమైన నాయకులకు అప్పగిస్తుంటారు. గత ప్రభుత్వంలో ఈ శాఖకు ప్రాతినిధ్యం వహించిన హరీశ్‌రావు ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకాన్ని కలిగించగలిగారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగడం, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలు ఇలా నిరుపేదలకు సర్కార్ వైద్యాన్ని చేరువ చేసే చర్యలు చేపట్టగలిగారు. మరోవైపు అన్ని జిల్లాలకు వైద్య కళాశాలలు మంజూరయ్యాయి. ఇలా ఎంతో కీలకమైన ఈ శాఖ ఇప్పుడు దామోదర రాజనర్సింహకు దక్కింది. అప్పట్లోనే సివిల్ ఇంజనీరింగ్ విద్యనభ్యసించిన దామోదరకు అనేక అంశాలపై లోతైన పరిజ్ఞానం ఉంటుందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఎంతో కీలకమైన వైద్యారోగ్యశాఖను దామోదరకు కేటాయించడం ద్వారా సమర్థవంతంగా ఈ శాఖను నడిపించగలరని కాంగ్రెస్ అధినాయకత్వం భావించింది. ఈ క్రమంలోనే దామోదరకు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖను అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

## పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు**



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

**సిద్దిపేట అర్బన్:** ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. శనివారం సిద్దిపేటలోని కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటును సీపీఎం స్వాగతిస్తోందని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అందుకు సీపీఎం పార్టీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలను త్వరగా అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల అములుకు పోరాటాలే సరైన మార్గమని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు శశిధర్, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్, యాదగిరి, రవికుమార్, బాల్‌నర్సయ్య, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, ప్రశాంత్, శారద, నవీన తదితరులు పాల్గొన్నారు.

# డిపో దశ మారేనా..?

- రవాణా శాఖ మంత్రిగా ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్ ఆర్టీసీ డిపో అభివృద్ధిపై గంపెడాశలు
- సిద్దిపేట, వరంగల్ రూట్లలో పల్లెవెలుగు ఎదురుచూపులు
- లాంగ్ రూట్లలో ఎక్స్‌ప్రెస్‌లకు అవకాశం
- నష్టాల నుంచి లాభాల బాట పట్టేనా?



హుస్నాబాద్ ఆర్టీసీ డిపో

**హుస్నాబాద్:** పోరాటాలు చేసి సాధించుకున్న హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఆది నుంచి నష్టాలే చవిచూస్తుంది. డిపోకు సరైన బస్సులు లేక లాంగ్ రూట్లలో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపక కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైంది. ఒకటి రెండు లాంగ్ రూట్లు తప్ప, మిగితా పట్టణాలకు ఎక్స్‌ప్రెస్‌లు వెళ్లలేని గడ్డు పరిస్థితి నెలకొంది. ఒకానొక సమయంలో డిపోను ఎత్తివేస్తారనే ప్రచారం జరిగింది. ప్రస్తుతం హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా పదోన్నతి పొందడంతో మళ్లీ డిపోకు ప్రాణం పోసినట్లయింది.

**నెలకు రూ.17 లక్షల నష్టం**

హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో 52 బస్సులు ఉన్నాయి. ఇందులో 6 ఎక్స్‌ప్రెస్ బస్సులు, 2 సూపర్ లగ్జరీ, 6 మినీ బస్సులు, మిగిలినవి ఆర్డినరీ బస్సులు ఉన్నాయి. ఈ బస్సులు ప్రతి రోజూ 18,200 కి.మీటర్ల దూరం వరకు ప్రయాణం చేస్తున్నాయి. నిత్యం 17 వేల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. రోజూ రూ.7 లక్షల వరకు ఆదాయం వస్తుంది. కానీ, వచ్చిన ఆదాయం డీజిల్, జీతాలు, మెయిన్‌టెనెన్స్‌కే సరిపోవడం లేదు. డిపో నుంచి హైదరాబాద్, గోదావరిఖని, మంచిర్యాలకు మాత్రమే లాంగ్‌రూట్లలో బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. హైదరాబాద్, కరీంనగర్, హుజూరాబాద్ రూట్లల్లోనే కలెక్షన్ అధికంగా వస్తుంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో నడిచే బస్సులతో రోజూ నష్టాలే వస్తున్నాయి. అలాగే హుస్నాబాద్ డిపో నుంచి సిద్దిపేట, వరంగల్ బస్సులు లేవు. ఈ రూట్లలో కేవలం సిద్దిపేట, వరంగల్ డిపో బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. దీంతో ఈ రెండు డిపోలు ఆదాయాన్ని ఘనసీయంగా పొందుతున్నాయి. ప్రస్తుతం హుస్నాబాద్ డిపో ప్రతి నెలా దాదాపు రూ.17 లక్షల వరకు నష్టాల్లో నడుస్తోంది.

**మంత్రిపైనే ఆశలన్నీ..**


హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్‌కి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పదవి రావడంతో డిపోపై కమ్ముకున్న నీలినీడలు తొలగిపోయాయని ఈ ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నారు. డిపో అభివృద్ధి బాటలో ముందుకెళ్తుందని విశ్వసిస్తున్నారు. డిపోకు ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులను పెంచినట్లయితే లాంగ్‌రూట్లల్లో ఆదాయం పెరుగుతుంది. సిద్దిపేట, వరంగల్ రూట్లలో హుస్నాబాద్ డిపో బస్సులు నడిపిస్తే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది.

### నాడు కేసీఆర్... నేడు పొన్నం

హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ప్రారంభోత్సవానికి ఉమ్మడి ఏపీ సమయంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న కేసీఆర్ వచ్చారు. ఆయన తర్వాత రెండో మంత్రిగా పొన్నం ప్రభాకర్ నిలుస్తారు. 70 ఏళ్ల తర్వాత హుస్నాబాద్‌కు మంత్రి యోగం దక్కడం, అది కూడా రవాణా శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ పదవిని చేపట్టడం ఆర్టీసీ డిపో అభివృద్ధికి నాంది పలికినట్లే.

# నామినేటెడ్‌పై నజర్

- పదవులను ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకులు
- ఓడిపోయిన.. టికెట్ ఆశించిన వారు పోటీ
- రాష్ట్రస్థాయిలో వివిధ కార్పొరేషన్ల, జిల్లా స్థాయి చైర్మన్ పోస్టులు
- ఆది నుంచి ఉన్నవారికే ఇవ్వాలంటున్న నేతలు




**సాక్షి, సిద్దిపేట:** పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలు నామినేటెడ్ పదవులపై నజర్ పెట్టారు. రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులను పొందేందుకు దృష్టి పెట్టారు. ప్రభుత్వం ఏర్పాటు కావడంతోపాటు మంత్రులకు శాఖల కేటాయింపు సైతం జరగడంతో కాంగ్రెస్ నేతలు నామినేట్ పదవులు పొందేందుకు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్ర స్థాయి వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా స్థాయి చైర్మన్లు, డైరెక్టర్ల పదవులు పొందేందుకు ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పదేళ్ల కష్టకాలంలో పార్టీని పట్టుకొని ఉన్న వారికి నామినేట్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని, అధికారంలోకి రాగానే ఇతర పార్టీల నుంచి వచ్చే నేతలకు పదవులు ఇవ్వొద్దని కాంగ్రెస్ నేతలు, నాయకులు కోరుతున్నారు.

**పోటాపోటీగా..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఒక్క హుస్నాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ మాత్రమే గెలుపొంది రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా నియామకం అయ్యారు. మిగతా నియోజకవర్గాలైన సిద్దిపేట నుంచి పోటీ చేసిన హరికృష్ణ, దుబ్బాకలో పోటీ చేసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి, గజ్వేల్ నుంచి నర్సారెడ్డి ఓటమి చెందారు. ఆయా నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. ఈ నియోజకవర్గాల్లో ఓటమి చెందిన నేతలు ఆర్థికంగా నష్టపోవడంతో రాష్ట్రస్థాయి వివిధ కార్పొరేషన్ చైర్మన్ నామినేట్ పదవులను ఆశిస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ నేతలకు అధికారంలోకి రాగానే నామినేట్ పదవులు ఇస్తామని భరోసా ఇచ్చారు. దీంతో పోటీ నుంచి వెనక్కి తగ్గారు. హుస్నాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి, దుబ్బాక నుంచి శ్రవణ్ కుమార్ రెడ్డి, సిద్దిపేట నుంచి దరిపల్లి చంద్రంతోపాటు మరో 10 మంది నేతలు పోటీలో నుంచి తప్పుకున్నారు.

**జిల్లా స్థాయి పదవులు**

కష్టకాలంలో సైతం పార్టీలో కొనసాగిన వారు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పదవులు ఆశలు పెట్టుకున్నారు. సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా), జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులు ఉండటంతో వాటిపై రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు దృష్టి పెట్టారు. ఇవే కాకుండా వచ్చే ఏడాది మే చివరికి జెడ్పీటీసీలు, ఎంపీటీసీల పదవీకాలం పూర్తి కానుంది.ఇవన్నీ కలిపితే జిల్లాలో ఎక్కువ మొత్తంలో స్థానిక సంస్థల పదవులున్నాయి. వీటన్నింటినీ ఎన్నికల ద్వారా రిజర్వేషన్ ప్రకారం పోటీ చేయనున్నారు. పలువురు తమ అభిమాన నేతలకు ఓ నామినేట్ పోస్ట్ వస్తుందని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు.

## క్లుప్తంగా

### తేలని పంచాయితీ

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ మండలం పందిల్ల స్వకృషి మహిళా పొదుపు సంఘం గణకురాలు రూ.20 లక్షల వరకు సభ్యుల డబ్బులను స్వాహా చేసిందని సంఘం సభ్యులు శనివారం గణకురాలు ఇంటికి తాళం వేసి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని మహిళలను స్టేషన్‌కు తీసుకువెళ్లి చట్టాల గురించి అవగాహన కల్పించారు. సమస్యను శాంతియుతంగా పరిష్కారించుకోవాలని చెప్పి పంపించినట్లు సంఘ సభ్యులు తెలిపారు.

### అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానం


సంగ్రాం మహారాజ్‌

నారాయణఖేడ్‌: ఉత్తరప్రదేశ్‌లో అయోధ్యలో జనవరి 22న జరగనున్న రామమందిరం ప్రారంభోత్సవానికి అఖిల భారత సాధుసంతేల రాష్ట్ర ప్రతినిధి, ఖేడ్‌ మండలం కొండాపూర్‌ హనుమాన్‌ ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్‌కు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్‌ రాయ్‌ ఆహ్వానాన్ని పంపించారు. విమాన టికెట్లు తదితర ఖర్చులను ఉత్తర్‌ప్రదేశ్‌ రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఆహ్వాన పత్రంలో పేర్కొన్నారు. గతంలో మందిర శంకుస్థాపన కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొన్నారు. తనకు ఆహ్వానం అందడం చాలా సంతోషంగా ఉందని సంగ్రాం మహారాజ్‌ తెలిపారు.

### కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

**మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌ రెడ్డి**

కుల్కచర్ల: కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌ రెడ్డి అన్నారు. కుల్కచర్ల మండలం చెల్లాపూర్‌ గ్రామంలో పోలెపల్లి బుచ్చయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందారు. మృతుడికి బీఆర్‌ఎస్‌ పార్టీలో సభ్యత్వం కలిగి ఉండడంతో శనివారం బాధితుల ఇంటికి వెళ్లి, రూ.2లక్షల బీమా చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి వచ్చినా తాము అండగా ఉంటామని, కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, సర్పంచ్‌ చంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, వెంకటయ్య, నాయకులు హరికృష్ణ, దామోదర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నారాయణఖేడ్‌: బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి


మెదక్‌: ఆర్టీసీ బస్సులో జీరో కాస్టు టికెట్లను చూపుతున్న మహిళలు, విద్యార్థినులు

# అతివల ఆనందం

**తగిన బస్సులు లేవు**
- సక్రమంగా నడపాలి
- అప్పుడే ఫ్రీ స్కీం ఉపయోగం
- మహిళలు, విద్యార్థినులు

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌ ప్రభుత్వం మహిళలకు ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి ఫ్రీ బస్‌ స్కీం'పై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే చాలా గ్రామాలకు బస్సులు లేవని, అదనంగా బస్సులు వేసి సక్రమంగా నడపించాలని కోరుతున్నారు. ఈ పథకం అమలుపై మహిళలు, విద్యార్థినులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.
– నర్సాపూర్‌:


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

నర్సాపూర్‌ నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు ఆర్‌టీసీ బస్సులు తిరగడంలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం శనివారం 'మహాలక్ష్మి ఫ్రీ బస్‌ స్కీం'ను అట్టహాసంగా ప్రారంభించింది. అది ఆనంద దాయకమైనప్పటికీ అసలు గ్రామాలకు బస్సులే లేకపోతే ఈ ఉచిత పథకం వల్ల ఉపయోగం ఏమిటని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ముందు తమ గ్రామాలకు బస్సులను సక్రమంగా నడపాలని కోరుతున్నారు. స్థానిక ఆర్‌టీసీ డిపోలో సరిపడా బస్సులు లేనందున నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు ఆర్‌టీసీ బస్సు సౌకర్యం లేదు.

### పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్‌

సంగారెడ్డి /సంగారెడ్డి టౌన్‌: కాంగ్రెస్‌ పార్టీ ప్రవేశ పెట్టిన మహిళలకు ఉచిత బస్‌ ప్రయాణ పథకాన్ని జిల్లా కలెక్టర్‌ శరత్‌ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక మెడికల్‌ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ఆర్టీసీ ఆర్‌ఎం ప్రభులతతో కలిసి ఆరు బస్సులను లాంచనంగా ప్రారంభించారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బాలికలు, మహిళలు, ట్రాన్స్‌ జెండర్లు ఉచిత ప్రయాణం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ మాధురి, డీఆర్వో నగేశ్‌, డీఈఓ, మెడికల్‌ కళాశాల ప్రిన్స్‌పాల్‌ వాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ అనిల్‌ తదితరులు పాల్గొన్నారు.

### ఆధార్‌కార్డు తప్పనిసరి



బస్సులలో ఉచిత ప్రయాణానికి ఆధార్‌కార్డు తప్పనిసరి. తెలంగాణ బార్డర్‌ దాటితే టికెట్‌ తీసుకోవాలి. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.
– ప్రభులత, ఆర్టీసీ ఆర్‌ఎం

### బస్సుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తా



నర్సాపూర్‌ డిపోలో బస్సుల సంఖ్య తక్కువగా ఉన్న విషయం ఈ రోజే నా దృష్టికి వచ్చింది. మహాలక్ష్మి ఫ్రీ బస్సు స్కీం మహిళలకు లబ్ధి కలిగే విధంగా బస్సులు పెంచేందుకు కృషి చేస్తా.
– ఆవుల రాజిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి

### పేద విద్యార్థినులకు మంచి అవకాశం



నాలాంటి పేద విద్యార్థినులు ఉన్నత చదువుల కోసం గ్రామాల నుంచి హైదరాబాద్‌ లాంటి నగరాలకు వెళ్లాలంటే చాలా ఖర్చుతో కూడిన పని. ఈ ఉచిత ప్రయాణం పథకం వల్ల రాష్ట్రంలోఎక్కడి కైనా వెళ్లి ధైర్యంగా చదువుకొనే అవకాశం దొరికింది.
– సౌమ్య, విద్యార్థిని, మెదక్‌

### పేదలకు ఆర్థిక భారం తగ్గుతుంది



ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు కొంత ఆర్థిక భారం తగ్గనుంది. ఈ పథకం మహిళలకు వరం లాంటిది.
– లావణ్య, పిడిచెడ్‌, గజ్వేల్‌

### ఉచిత ప్రయాణం సంతోషకరం



ఆర్‌టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ పథకంతో సంతోషంగా ఉంది. నర్సాపూర్‌ నుంచి వెల్దుర్తికి వెళ్లి వస్తుంటాను అందుకు రూ.30 చార్జి అయ్యేది. ఇప్పుడు ఆ డబ్బులు మిగలడంతో ఆనందంగా ఉంది.
– సుగుణ, వెల్దుర్తి

### విద్యార్థులకు ఎంతో మేలు



ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం విద్యార్థులకు ఎంతో మేలు కలిగిస్తుంది. ప్రతి నెల రూ.600 చెల్లించి బస్‌పాస్‌ తీసుకోవాల్సి వచ్చేది. కాంగ్రెస్‌ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల నాతో పాటు విద్యార్థినులకు ఎంతో ఉపయోగం. – మౌనిక, విద్యార్థిని

### బస్సుపాసు కొనే బాధ తప్పింది..



నారాయణఖేడ్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంపీహెచ్‌డబ్ల్యూగా అప్రెంటిషిప్‌ చేస్తున్నాను. బుజరాన్‌పల్లి నుంచి నారాయణఖేడ్‌కు నిత్యం వస్తా ను. నెలకు రూ.1,600 బస్‌పాస్‌ను కొనుగోలు చేసేదానిని. ఇప్పుడది తప్పింది.
– గంగమణి, బుజరాన్‌పల్లి

### ఎప్పటికీ ఉండాలి..



బస్సు ఎక్కి దిగితే రూ.50 ఖర్చు. హైద్రాబాద్‌ వెళ్లి వస్తే రెండు వందలకు చార్జీలు అవుతుండే. ఈ పథకంతో ఆ డబ్బులు మిగిలినట్లే. ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు. ఈ పథకం ఎప్పటికీ కొనసాగిస్తే బాగుండు.
– భాగమ్మ, దాకూర్‌, అందోల్‌

# నాచగిరి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

**భారీగా సత్యనారాయణస్వామి వ్రతాలు**
- 6 వేల మంది భక్తులు సందర్శన
- కిటకిటలాడిన పుణ్యక్షేత్రం


నాచగిరిలో వ్రతమాచరిస్తున్న దంపతులు


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

వర్గల్‌(గజ్వేల్‌): సుప్రసిద్ధ నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం ఆఖరి శనివారం కావడంతో భక్తుల నృసింహ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ప్రత్యేక పూజలు, వ్రతాలు, అభిషేకాలు, కల్యాణాలతో నాచగిరి కార్తీక శోభ సంతరించుకుంది. హైదరాబాద్‌, సికింద్రాబాద్‌ జంట నగరాలు, ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హరిద్రానదిలో పుణ్యస్నానాలాచరించారు. దంపతుల సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, స్వామివారి కల్యాణం, నిజాభిషేకాలతో క్షేత్రం కిటకిటలాడింది. 156 సత్యదేవుడి వ్రతాలు, 10 కల్యాణాలు, 9 నిజాభిషేకాలు జరుగగా, స్వామిని 6 వేల మంది దర్శించుకున్నారని ఈఓ అన్నపూర్ణ తెలిపారు. భక్తులకు ఏ ఇబ్బందీ కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆమె పేర్కొన్నారు.

# అమల్లోకి రెండు పథకాలు


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

నర్సాపూర్‌: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు శనివారం నుంచి ప్రభుత్వం రెండు పథకాలను అమలు చేస్తోందని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. శనివారం మహాలక్ష్మి పథకం ప్రారంభోత్సవం సందర్భంగా బస్టాండ్‌లో జెండా ఊపి బస్సు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ ఆరు గ్యారంటీల హామీలు ఇచ్చిందన్నారు. అందులో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం రెండింటినీ ప్రారంభించారని తెలిపారు. మిగతా వాటిని సైతం అమలు చేస్తారని చెప్పారు. బస్సులో ఉచిత ప్రయాణం పథకం పేద మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని వెల్లడించారు. ఆర్‌టీసీ సిబ్బంది శాఖయ్య, రాజుగౌడ్‌, శ్యాంసుందర్‌గౌడ్‌, వెంకట్‌గౌడ్‌, అయూబ్‌ఖాన్‌, బీఎంఎస్‌రెడ్డి, తాత్కాలిక డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌, నాయకులు మల్లేశ్‌, రిజ్వాన్‌, కరుణాకర్‌రెడ్డి, సుహాసినీరెడ్డి, జయశ్రీ పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- భర్తపైనే అనుమానం
- బంధువుల ఆందోళన


ఆందోళన చేస్తున్న పద్మ బంధువులు


పద్మ (ఫైల్‌)

మిరుదొడ్డి(దుబ్బాక): అనుమానాస్పద స్థితిలో భార్య మృతి చెందగా భర్తే ఆమెను హత్య చేశాడని ఆరోపిస్తూ బాధితురాలి బంధువులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన మిరుదొడ్డిలో శనివారం జరిగింది. మహిళ బంధువులు, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం.. మిరుదొడ్డికి చెందిన కమలాకర్‌తో వర్గల్‌ మండలం గుంటి పల్లి గ్రామానికి చెందిన పద్మ(22)కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నాళ్లకు వారి మధ్య కలహాలు నెలకొనడంతో రెండు, మూడు సార్లు పెద్దలు నచ్చజెప్పారు. ఇటీవల అదనపు కట్నం తీసుకు రావాలని భార్య పద్మను కమలాకర్‌ వేదించడంతో రెండు రోజులుగా వారి మధ్య గొడవలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో శనివారం తెల్లవారు జామున పద్మ ఇంట్లోనే అనుమానాస్పదంగా మృతి చెందింది. దీంతో ఆమె భర్తతో పాటు అత్తమామలు ఇంటి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న పద్మ తల్లి దండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. కమలాకర్‌ను శిక్షించాలని డిమాండ్‌ చేశారు. సమాచారం తెలుసుకున్న గజ్వేల్‌ ఏసీపీ ఎం.రమేశ్‌, సిద్దిపేట రూరల్‌ సీఐ చేరాల్‌ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని క్లూస్‌ టీంతో పరిశీలించారు. ఆందోళనకు దిగిన పద్మ బంధువులకు పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు వారికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. నిందితులను కఠినంగా శిక్షిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. పద్మ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్‌ ఏసీపీ ఎం. రమేశ్‌ తెలిపారు.

# మళ్లీ చిరుత కలకలం

- మూడు మండలాల్లో సంచారం
- దాడి చేస్తుండడంతో దూడలు మృత్యువాత
- భయాందోళనలో గ్రామీణ ప్రజలు
- పొలాలకు వెళ్లలేకపోతున్న రైతులు
- పులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్న అటవీ శాఖ అధికారులు


టెంకటి శివారులో చిరుతపులి దాడిలో మృత్యువాతపడిన దూడను పరిశీలిస్తున్న ఫారెస్ట్‌ అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్‌): చిరుత పులి సంచారం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పెద్దశంకరంపేట మండలంతో పాటు రేగోడ్‌, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలాల్లో రెండు నెలలుగా చిరుత పులి సంచరిస్తోంది. ఈ మండలాల పరిధిలో అటవీప్రాంతం ఉంది. ఆయా గ్రామాల రైతులు అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న పొలాల్లో వ్యవసాయం చేస్తుంటారు. తమ పశువులను వ్యవసాయ క్షేత్రాల వద్ద కట్టేస్తుంటారు. దీంతో రాత్రి వేళ వాటిపై దాడిచేస్తుంటంతో మృత్యువాతపడుతున్నాయని రైతులు చెబుతున్నారు. పులి సంచరిస్తోందని రాత్రి వేళ పొలాలకు వెళ్లేందుకు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

**ఆ మండలాల పరిధిలోనే..**

మండలంలోని టెంకటి, కట్టెల వెంకటాపూర్‌, గొట్టిముక్కల గ్రామాల పరిధిలో ఎక్కువగా చిరుత పులి సంచరిస్తోంది. గత సెప్టెంబర్‌లో టెంకటి, కట్టెలవెంకటాపూర్‌ గ్రామంలో, ఇటీవల గొట్టిముక్కల గ్రామంలో దాడిచేయంతో దూడలు మృత్యువాతపడ్డాయి. ఇవన్నీ గ్రామాల శివారులో జరిగిన సంఘటనలు. రెండు నెలల క్రితం కనిపించిన పులి ఇటీవల మళ్లీ కనిపించడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. అలాగే రేగోడ్‌ మండలంలోని తిమ్మాపూర్‌, కొత్వాన్‌పల్లి, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలో పలుచోట్ల చిరుత పులి సంచరించింది. అటవీ శాఖ అధికారులు చిరుత పులిని బంధించేందుకు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### రైతులు జాగ్రత్తగా ఉండాలి

మండలంలో చిరుతపులి మళ్లీ సంచరిస్తోంది. రైతులు తమ పొలాలకు వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. పులి జాడ తెలిస్తే పశువుల కాపరులు వెంటనే ఫారెస్ట్‌ అధికారులకు సమాచారం అందించాలి. పులిని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.
– వికాస్‌, ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌, పెద్దశంకరంపేట

# వేతనం రాలేదని పంచాయతీ కార్మికుడి మృతి


ఎల్లం(ఫైల్‌)

రాయపోలు(దుబ్బాక): ఐదు నెలలుగా వేతనం రాలేదని మనస్తాపం చెందిన పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. బేగంపేట ఎస్‌ఐ అరుణ్‌ కుమార్‌ కథనం ప్రకారం.. బేగంపేటకు చెందిన మంకిడి ఎల్లం(38) సుమారు పదేళ్లుగా పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడికి ఐదు నెలల నుంచి వేతనం రాలేదు. దీంతో ఇల్లు గడవడం కష్టంగా మారడంతో కొన్నాళ్లుగా మనస్తాపంతో ఉన్నాడు. ఈ క్రమంలో శుక్రవారం విధులలో భాగంగా భగీరథ ట్యాంకు నీళ్లు విప్పేందుకు వెళ్లి హఠాత్తుగా అక్కడే మృతి చెందాడు. వేతనం రాలేదన్న బెంగతో హఠాన్మరణం చెందాడని అతడి భార్య రజిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

**వాహనం ఢీకొని వృద్ధురాలు..**

చిన్నకోడూరు(సిద్దిపేట): గుర్తు తెలియని వాహనం ఢీకొని మతి స్థిమితం లేని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అనంతసాగర్‌లో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. సిద్దిపేటలోని కేసీఆర్‌ నగర్‌కు చెందిన వడ్ల భూలక్ష్మి(72) రెండు నెలల నుంచి మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై కాగితాలు ఏరుకుంటూ తిరుగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి అనంతసాగర్‌ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె మనవడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాస్‌గౌడ్‌ తెలిపారు.

### నారీ శక్తి... ఎందరికో స్ఫూర్తి..



ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళా లోకం ఇప్పుడు అన్నిట్లో ముందడుగు వేస్తోంది. ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే తాము ఎంచుకున్నరంగంలో రాణిస్తూ పలువురికి స్ఫూర్తి ఇస్తున్నారు. సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి వద్ద శనివారం బందోస్తుకు వచ్చి.. దొరికిన కొద్దిపాటి విరామాన్ని ఇలా గడుపుతూ సాక్షి కెమెరా కంటపడ్డారు.
– సాక్షిస్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, సిద్దిపేట